గ్లాసుంది కదా అనుకున్నాను. అయినా గ్లాసెంత చేస్తుంది మహాఅయితే ఒక రూపాయి.వస్తాడా, రాడా అన్న సస్పెన్సుతో నా తల బద్దలైపోతోంది. "ఓ అమాయకుడి నిజాయితీ శంకిస్తున్నావు" మనసు చీవాట్లే సింది. సరే చూద్దాం. ఇదీ ఓ గుణపాఠంలా వుంటుంది. వాడు రాకపోయినా గ్లాసుందికదా అనుకున్నాను. ఓ మనిషి నిజాయితీ విలువ అయిదురూపాయలా అనిపించింది.

కూతవేసింది రైలు. మెల్లగా కదిలింది. కిటికీలోంచి చూశాను వాడికోసం. ఇక రాడనుకున్నాను. మెల్లగా స్పీడందుకుంది రైలు. కిటికీ దగ్గరే వుంది నా తల

రొప్పుతూ రైలు వెంట పరుగెత్తుకొస్తు న్నాడు వాడు వాడి నిజాయితీ శంకించి నందుకు నన్ను నేనే తిట్టుకుంటూ, మాన వత్వం మీద మరోసారి నమ్మకం పెంచు కుని కిటికీ గుండా రెండు చేతులూ బయట పెట్టాను—ఒక చేత్తో గ్లాసందిస్తూ మరో చెయ్యి చిల్లరకన్నట్లు.

ఇంకొంచెం స్పీడందుకుంది రైలు. కిటికీ దగ్గరికి వచ్చినవాడు గ్లాసు లాగేసుకుని చిల్లర యివ్వకపోగా వెక్కిరించినట్లు నవ్వి ఆగిపోయాడు. వాడిని దాటిపోయింది రైలు.

ఆవాక్కయిపోయాను, వాడి తెలివితేట లకు. మనస్సు సిగ్గుపడి మాట్లాడం మానే సిందివాడి నిజాయితీ గురించి.

—సి. శైలకుమార్

## నాంది

పైడితల్లి తెచ్చియిచ్చిన యిచ్చు రూపాయి —ఉప్పువేసి ఉడకేసిన కందమూలం దుంపలు తీసుకొని, ఒక గంపనిండా చింత పండు యిచ్చాడు గిరిజనుడు.

వల్లం నుంచి కొండమీదకు పోయి, ఏ కాలంలో దొరికే వస్తువులు ఆ కాలంలో గిరిజనులదగ్గర వస్తు మారకం చేసుకొని వాటిని తెచ్చి బస్తీలో అమ్ముకోడం పైడి తల్లి వ్యాపారం.ఆ విధంగానే ఆ రోజు గిరి జనుడు ఇచ్చిన చింతపండు కార్పొరేషన్ వాళ్ళు బాధపడకుండా ఉండేందుకు, పట్నం తీసుకెళ్ళకుండా, కొండ దిగువనే, ఇల్లు కట్టుకొని వ్యాపారం చేసుకొంటున్న వరాల సెట్టికి అమ్మేశాడు పైడితల్లి.

కార్పొరేషన్ వారి లారీ డ్రైవర్ కే ఎంతో కొంత ముట్టచెప్పి, అదే చింత పండులో కొంత చిల్లర వ్యాపారం కోసం ఉంచుకొని. మిగిలింది పట్నంలో వున్న సేట్ గోపీచంద్ కి తాను కొన్న ధరకి రెట్టింపు చేసి పంపించేశాడు వరాలశెట్టి.

వరాల శెట్టి దగ్గరనుంచి వచ్చిన చింత పండునే.కొంచెం శుభ్రం చేయించి, ప్లాస్టిక్ కవరులో నింపించి, తాను కొన్న ధరకంటె మూడురెట్లు ధరపెంచి, దేశాలకి పంపిం




చేశాడు శేఠ్ గోపీచంద్.

ఈ వ్యాపారమంతా ఇలాగే, సాగుతూ వుంటుంది....

నిత్యావసర వస్తువులతోపాటు చింత పండు కూడా అవసరం వచ్చింది గిరిజను డికి. అది కొనుక్కొని పోదామని కొండ దిగువనున్న వరాలశెట్టి దుకాణానికి వచ్చేడు గిరిజనుడు. అక్కడ శెట్టి దుకా ణంలో, రేడియో, దేశంలోని వార్తలు అప్పచెప్పేస్తోంది.

చింతపండు కావాలని అడిగిన గిరిజను డికి. పావలా తీసుకొని, నల్లగా మట్టి ముద్దలా వున్న ఒక పిడచ పండు ఇచ్చాడు శెట్టి. తన చేతిలోవున్న చింతపండు వంక ఒకసారి, శెట్టి చేతిలోవున్న తన పావలా కాసు వంక ఒకసారి, మార్చి మార్చి ఆశ్చ ర్యంగా చూడసాగాడు గిరిజనుడు.

"ఏట్రా అలాగసూత్తన్నావ్! అది చింత వండేన్రా! ఇప్పుడు రేడియోలో వార్తలు వినలేదా? దేశంలో పండు ఖరీదు కిలో పది రూపాయలు అయిందని.అయినా అయ్యన్నీ నీకేటి తెలుస్తాయి. ఎల్లెల్లు" అని కసురు కొన్నాడు శెట్టి

చేతిలో ఉన్న చింతపండు చూస్తూ కొండెక్కిపోయాడు గిరిజనుడు.

"ఇదేటి యిచిత్రం! నాకాడనుండెళ్ళిన చింతపండు, నాకు కావలసి వచ్చేసరికి, కరీదులోనే కాకుండా, రంగులోకూడా ఇంత మారిపోయినాదేటి!" అని పులుపుచాలని పులుసు తింటూ ఆలోచించాడు బ్రతుకు తెరువు తెలియని గిరిజనుడు.

—"యస్సార్లు"